# అందం




భానుమూర్తి

కళ్ళు చెదిరిపోయే అందం 'ఆమె'ది. ఒకనాటి ఉదయం చూశాను, 'ఆమె'ను మొదటిసారిగా. వాకిలి వూడ్చి, నీళ్ళుజల్లి ముగ్గు లేస్తూంది. నిజంగా అద్భుతమైన అందం !...

చదివిన చదువుకు తగిన ఉద్యోగం కాకున్నా, ఏదో ఉద్యోగం సంపాదించగలిగాను అన్న తృప్తి మిగిలింది. స్వగ్రామానికి దూరంగా వేశారు నన్ను జానెడు పొట్టకోసం ఎక్కడికయినా వెళ్ళక తప్పదు తాత ముత్తాతలు ముట్టజెప్పిన ఆస్తిపాస్తులేమీ లేవు మరి. కొద్దిగా కష్టపడినా, మంచి ఇల్లే దొరికింది. రెండు గదులు. బ్రహ్మచారిని. అవి నాకు చాల ఎక్కువ. ఓనర్స్ మంచివాళ్ళు కావటంతో అద్దె కొంచెం ఎక్కువయినా అక్కడే ఉండిపోవాలనే నిర్ణయానికొచ్చాను. ప్రక్క ఇల్లే చలపతిరావుది. ప్రతిరోజు అతన్ని ఏదో సందర్భంలో చూస్తూ ఉన్నా ఎప్పుడూ పలుకరించలేదు. నేను కొంచెం రిజర్వ్‌గాడి ఉంటానని స్టూడెంట్ లైఫ్‌నుంచీ నాకు పేరుంది. కాని నిజం చెప్పాల్సి వస్తే నాకు ఎక్కువగా మాట్లాడటం చేతకాదు. ఎప్పుడయినా మాట్లాడాల్సి వచ్చినా, ముందుగా చాలసార్లు రిహార్సల్స్ చేసుకుని మరీ వెళతాను. ఈ నా మెంటాలిటీని మార్చుకోవాలని చాలసార్లు ప్రయత్నించాను. కాని లాభం లేకపోయింది. నా పోకడ చూసి 'వాడికి గర్వం' అనుకున్న వాళ్ళు కూడా లేకపోలేదు. ఆ రోజు సాయంత్రం పెరాట్లో కూర్చుని టీ త్రాగుతున్నాను. చలపతిరావుతో పరిచయం అక్కడ జరిగింది. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాడు. 'ఆమె' చలపతిరావు భార్య. అతను కూడా ఆమెకు తగ్గట్టుగా ఉంటాడు. ముచ్చటగా ముగ్గురు పిల్లలు. పాప లిద్దరూ అచు. ఆయన పోలికే. బాబుమాత్రం తల్లిలా ఉంటాడు. కొద్దిరోజుల్లోనే చలపతిరావు నాకు మంచి మిత్రుడయాడు. రోజులో కనీసం ఒకసారయినా వాళ్ళ పిల్లలు నన్ను పలుకరించి పోతుంటారు 'అంకుల్, 'అంకుల్' అంటూ ముచ్చటగా తిరిగే ఆ పిల్లల్ని చూస్తే ముద్దొస్తుంది. మొదట్నుంచీ నాకు పిల్లలతో కాలక్షేపం చేయటం చాల ఇష్టం. నిష్కల్మషంగా మాట్లాడతారు. మల్లెపువ్వుల్లాంటి మనసులు. వాళ్ళు మాట్లాడే తీరు, ఆ చేష్టలు చూస్తూ అలాగే గడిపేయాలనిపిస్తుంది.

• • •

ఆ రోజు ఆదివారం. పేపర్ చదవటం ముగించి, అలా చలపతిరావు దగ్గరకు వెళ్ళి వద్దామని బయలుదేరాను. ఈమధ్య కాఫీ ఫలహారాలతోపాటు, అప్పుడప్పుడు వాళ్ళింట్లో భోజనంచేసే చనువు కూడా ఏర్పడింది. తలుపు తట్టాను, 'రండి అన్నయ్యగారూ' అంటూ ఆహ్వానించింది 'ఆమె'.

'చలపతి ఉన్నాడా?' అడిగాను. "ఇప్పుడే అలా బయటకు వెళ్ళారు—వస్తారు కూర్చోండి" అంటూ కుర్చీ చూపించింది. టేబుల్‌మీదున్న మేగ్‌జైన తీసుకుని చూస్తూ కూర్చున్నాను.

"వీరు మా బంధువులు—వరుసకు అన్నయ్య అవుతారు" అంటూ ప్రక్కనే కుర్చీలో కూర్చున్న తన్ని పరిచయం చేసింది. అప్పటి వరకూ నేనతన్ని గమనించనేలేదు. మనిషి ఆకర్షణీయంగా ఉన్నాడు. చలపతికన్నా వయసులో చిన్నగా కనుపిస్తున్నాడు. "అన్నయ్య ఎప్పుడొచ్చినా నాకు ఏదో ఒక ప్రెజెంటేషన తెస్తూ ఉంటాడు. ఈ శారీ చూశారా—అన్నయ్య తెచ్చిందే" అంటూ చూపించింది. ఫార్మాలిటీగా చేతుల్లోకి తీసుకుని చూశాను. ఏ రకం శారీయో తెలీలేదు కాని చాల -స్మీ గా తోచింది. "మాట్లాడుతూ కూర్చోండి, ఇప్పుడే వస్తా" అంటూ లోనికి వెళ్ళిందామె. కలుగ జేసుకుని మాట్లాడినా ఎక్కువగా మాట్లాడ లేదతను. ముభావంగా కూర్చున్నాడు.

అతని ముఖకవళికలు గమనిస్తే నే నెక్కడ

ఉండటం అలవాటులో ఇష్టం ఉన్నట్లుగా అనిపించలేదు. ఇంతలో ఆమె ఇద్దరికీ కాఫీలు అందించింది. కాఫీ త్రాగటం పూర్తి చేసి, 'మళ్ళీ వస్తాను' అని చెప్పి బయలుదేరాను. సరిగ్గా ఇది జరిగిన పెల రోజులకు నుకుంటాను—ఆరోగ్యం బాగుండక ఒకరోజు ఆఫీసుకు సెలవుపెట్టి ఇంట్లో ఉండిపోయాను. కుర్చీలో కూర్చుని బుచ్చిబాబుగారి 'చివరకు మిగిలేది' చదువుతున్నాను. నా రెంత రూమ్ కిటికీగుండా చూస్తే చలపతి బెడ్‌రూం కనిపిస్తుంది. ఉదయమే ఒకసారి దాన్ని పూర్తి చేసి, మిగిలింది ఫ్లాస్కులో పోసి ఉంచాను. మరోసారి దాన్ని త్రాగాలనిపించి లేచాను. అనుకోకుండా నా దృష్టి అటు మళ్ళింది. వాళ్ళ బెడ్‌రూం మంచం మీద 'అతను' పడుకుని ఉన్నాడు. ఆమె అతని ప్రక్కనే కూర్చుని నవ్వుతూ కబుర్లు చెబుతోంది. అతనేదో సమాధానమిస్తున్నాడు. ఇద్దరూ నవ్వుకుంటున్నారు. హఠాత్తుగా అతను ఆమెను దగ్గరగా లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు. ఆమె సిగ్గుపడుతూ సోభనపు పెళ్ళికూతుర్లా అతని గుండెల్లో తలదాచుకుంది. ఆ దృశ్యం చూసిన నా మెదడు మొద్దుబారింది. నేను చూసింది, చూస్తోంది కలా! నిజమా! అన్న సందేహం కలిగింది. సభ్యత కాదని మనసు వారిస్తున్నా ఇంకా ఏం జరుగుతుందోననే కుతూహలంతో చూడసాగాను. అతను ఆమెకేదో సైగ చేశాడు. ఆమె వచ్చి కిటికీ తలుపులు మూసింది. కాఫీ సంగతి మరిచాను. అలాగే వెళ్ళి మంచంమీద వాలాను. నా మస్తిష్కం ఆలోచనలతో నిండిపోయింది. ఆమె చేస్తున్న పనేమిటి? వాళ్ళిద్దరి మధ్య ఉన్న సంబంధం ఎటువంటిది? ఆరోజు 'అతన్ని' 'అన్నయ్య' అంటూ పరిచయంచేసిందే!! ఈ తతంగం చలపతిరావుకు తెలుసుంటుందా? తెలిస్తే ఎందుకూరుకున్నట్లు!?...పూర్ ఫెలో చలపతి కేదో అన్యాయం జరుగుతోంది....జరిగిపోతోంది... నా ఈ ప్రశ్నలు, సందేహాలు నాలోనే ఉండిపోయాయి.

• • •

ఆ తరువాత చలపతిరావును, ఆమెను చాలాసార్లు కలిశాను. ఇద్దరిలో ఎటువంటి మార్పులేదు. మామూలుగానే మసలుకొంటున్నారు. ఈమధ్య 'అతను' వాళ్ళింటికి తరచూ వస్తూండటం గమనించాను. నేను చూసిన ఆనాటి సంఘటన గురించి చలపతిరావుతో చెబుదామనుకున్నాను. చాలాసార్లు ఆ ప్రసక్తి తెద్దామనుకున్నాను కాని ధైర్యం చాలలేదు....

• • •

ఈమధ్య చలపతిరావులో ఏదో మార్పు కనిపిస్తోంది. చాలా డల్‌గా కనిపిస్తున్నాడు. దేనిమీదా అంత శ్రద్ధ చూపుతున్నట్లుగా లేదు. ఎప్పుడూ పరధ్యాన్నంగా —ఏదో ఆలోచిస్తున్నట్లుగా కనిపిస్తున్నాడు. ఒక సాయంత్రం ఇద్దరం సెంటర్ దాకా నడిచి వెళుతున్నాం. మౌనంగా నడుస్తున్నాడు చలపతి. ఏదైనా మాట్లాడించాలనుకున్నాను—

"ఈమధ్య మీరు ఎలాగో కనిపిస్తున్నారు" అంటూ కదిలించాను.

"అబ్బే...ఏం లేదు" అని ఊరుకున్నాడు.

"మీలో మీరే ఏదో బాధపడుతున్నట్లు తోస్తోంది."

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా నడిచాం.

"మీకు డ్రింక్స్...అదే హాట్ డ్రింక్స్ పుచ్చుకునే అలవాటుందా?" అడిగాడు చలపతి!

విస్మయపోయాను...కనీసం సిగరెట్టు స్మోక్ చేయటం కూడా నేను చూసి ఎరుగను.

"తాగుతానేం కాదు...అప్పుడప్పుడు కంపెనీ కోసం...." అంటూ ఆగాను.

"మీకేం అభ్యంతరం లేకపోతే ఈరోజు నాకు కంపెనీ ఇవ్వాలి" అన్నాడు. ఆశ్చర్యపోయాను. జోక్‌గా అంటున్నాడేమో అనుకున్నాను. కాని అతని ముఖం చూస్తే చాల సీరియస్‌గా అంటున్నట్లే ఉంది.

"నో అబ్జెక్షన్...కాని మీరు..."

"పదండి...తరువాత మాట్లాడుకుందాం..." అంటూ ముందుకు నడిపించాడు. అతన్ని 'హలో' అనటం నావంతయింది.

మూన్‌లైట్‌లో కూర్చున్నాం. బేరర్‌కి ఆర్డరిచ్చాడు చలపతి. ఐదు నిమిషాల్లో అన్నీ తెచ్చి పెట్టాడు బేరర్. గ్లాసులు నింపాడు చలపతి. పదినిమిషాలవరకు ఎవరం మాట్లాడుకోలేదు. కామ్‌గా గ్లాసులు ఖాళీ చేస్తున్నాడు చలపతి... నాకు నిషా తలకెక్కింది. గమ్మత్తుగా ఉంది.

"మీతో నా వ్యక్తిగతం చెప్పాలనిపించింది" అన్నాడు చలపతి బాటిల్ దగ్గరగా తీసుకుంటూ.

డిమ్‌లైట్ల వేపు చూస్తూ, మెల్లగా, కమ్మగా వినవచ్చే మ్యూజిక్ వింటూ, 'చెప్పండి' అన్నాను.

"నా భార్యను చూశావు కదా..."

"చూశాను" అన్నట్లుగా తలూపాను. నామెదడు స్వాధీనం తప్పుతోంది. అయినా అతను చెప్పేది వినేందుకు ముందుకు వంగాను.



"కాలేజీ చదివే రోజుల్లో మేమిద్దరం ప్రేమించుకున్నాం. హృదయాలను విప్పి మాట్లాడుకున్నాం. ఆమె నా దూరపు బంధువు కూడా కావటంతో మా పెళ్ళి ఎటువంటి అభ్యంతరం లేకుండానే జరిగిపోయింది..." చెప్పటం ఆపి బాయ్‌ని పిలిచి సిగరెట్స్ తెమ్మన్నాడు చలపతి.

"పెళ్ళయిన దగ్గర్నుంచీ ఇద్దరం ఇంకా దగ్గరయ్యాం. అమర సుఖాలు అనుభవించాం. మొన్నటి పిల్లల తల్లయినా, క్రొత్త పెళ్ళి కూతురులా కనిపించేది నా కళ్ళకు. ఆమె కూడా నన్నెంతో 'ఇదిగా' చూసుకునేది. ప్రతి రాత్రి ఒక తీయని రాత్రిగా గడిచిపోయేది..."

మాటల మధ్యలో సిగరెట్ వెలిగించుకుని నాకోటి అందించాడు చలపతి. కనులు బరువుగా మూతలు పడుతున్నాయ్. కనురెప్పల్ని బలవంతంగా తెరుస్తూ గట్టిగా సిగరెట్ దమ్ము పీలుస్తూ అన్నాడు చలపతి.

"నువ్వు నా మనసుకు నచ్చిన మిత్రుడివి, అందుకే నా పర్సనల్ మేటర్ నీతో చెబుతున్నా... నన్ను మరోలా అర్థం చేసుకోకు..."

ఆ స్థితిలో చలపతి చాల తమాషాగా కనిపించాడు.


సీరియస్‌గా తీసుకోవద్దని వారిస్తున్నా వినలేదు. మనసులో ఉన్న వ్యథను వెళ్ళగక్కేందుకు సిద్ధంగా కనిపించాడు.

"ఇక్కడకు రాకముందు నేను హైదరాబాద్‌లో పనిచేశాను. అక్కడే నా జీవితానికి నిప్పంటుకుంది. నువ్వు చూసే ఉంటావ్. 'అతను'—ఆ రోజుల్లో మా ఇంటి ప్రక్కన ఉండేవాడు. ఎలా మొదలయిందో తెలియదు నాకు. వాడు నా భార్యను వల్లో వేసుకున్నాడు. ఒకరోజు మధ్యాహ్నం ఆఫీసు ఫైలొకటి మర్చిపోయి ఇంటికి వచ్చాను... ఇంట్లో నా మెదడు చిట్లిపోయే దృశ్యాన్ని చూడాల్సి వస్తుందని నే ననుకోలేదు. వాళ్ళిద్దరూ ప్రణయ కలాపాలు జరుపుతున్నారు. నా భార్య ఇంకొకడితో కులుకుతున్నందుకు నేనెంత మథనపడ్డానో, నా మనసెంత వికలమయిందో నేను మాటల్లో చెప్పలేను...ఆమెకు నేనేం తక్కువ చేశానని ఇంత నీచానికి దిగజారింది! ఆ రాత్రి పిచ్చి కోపంతో ఆమెను చావబాదాను. ఎన్ని దెబ్బలు కొట్టినా కిక్కురుమనలేదు. అలసిపోయి ఊరుకున్నాను. రోజులు గడుస్తున్నాయ్... కాని ఆమె మాత్రం ఆ చండాలుడితో నీచ సంబంధం వదులుకోలేదు.... చివరకు అడిగాను— 'నీకు నేనేం తక్కువ చేశానని ఇలాంటి పనికి పూనుకున్నావ్?'

'మీరు నా కేలాంటి లోపం చేయలేదు. కాని నా మనసు అతన్ని కూడా కోరుకుంటూంది...' ఆ జవాబు విని మళ్ళీ చితకబాదాను. 'నా మనసు విప్పి చెప్పాను...మీ రిలా నన్ను హింసిస్తే నే నూరుకునేది లేదు. కావాలనుకుంటే మీకు విడాకు లివ్వడానికి సిద్ధం. అంతేగాని అతనితో సంబంధం తెంచుకునేది లేదు' అంది. అది విని నిశ్చేష్టుడ

[illegible]

ఇ. గోపాలరావు




పడ్డాను. ఆమెమీద చెప్పరాని అసహ్యం కలిగింది.''

చలపతి చెబుతున్నది వినటంతో నా మత్తు వదిలింది. చలపతి తాగి ఉండకపోతే —ఈ విషయాలన్నీ చెప్పి ఉండేవాడు కాదు...చేతిలోని సిగరెట్ ఏష్‌ట్రేలో పడేస్తూ— ''అయితే డైవర్స్ ఇవ్వకపోయావా?'' అన్నాను.

అప్పుడు, చలపతి స్థితిలో ఉంటే ఖచ్చితంగా అదే చేసేవాడ్ని.

చలపతి రెండు క్షణాలు మౌనంగా ఉండి, మరో సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు: ''మొదట్నుంచి పరువు, ప్రతిష్ఠలుగల వంశం మాది. నా ఖర్మగాలి 'ఇది' నాకు తోడయింది. రేపు డైవర్సిస్తే 'అది' 'వాడి'తో కులుకుతుంటే నా పరువేంగాను? నలుగుర్లో తలెత్తుకుని ఎలా తిరిగేది.''

ఆ క్షణంతో చలపతిని చూస్తే జాలేసింది.

''పరువు, ప్రతిష్ఠలని భయపడుతున్నారు... మరి 'ఈ విషయం' నలుగురికీ తెలిసిననాడు అవేమయిపోతాయ్?'' బాయిల్డ్ ఎగ్ తింటూ అన్నాను.

ఖాళీ చేసిన గ్లాసు పక్కన పెడుతూ అన్నాడు చలపతి: ''అందుకే నయానా భయానా చాల చెప్పి చూశాను. ఫలితం శూన్యం. చివరకు గట్టి ప్రయత్నంమీద అక్కడ్నుంచి ఈ వూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. ఆర్నెల్లవరకూ ఏ గొడవా లేదు. ఈమధ్యనే 'వాడు' మళ్ళీ తయారయ్యాడు...సంగతి నలుగురికీ తెలియకుండా సర్దుకుపోవటం అలవాటు చేసుకున్నాను....దయచేసి ఈ విషయం నీలోనే ఉంచుకో.''

* * *

చలపతి సంసారం గురించి చుట్టుపక్కల అమ్మలక్కలకు చాలావరకు తెలిసిపోయింది. భర్తలను ఆఫీసులకు పంపించి, రోజంతా 'ఆ టాపిక్' మీదనే సంభాషణ. చక్కటి కాలక్షేపం దొరికింది వాళ్ళకు. నేనూ ఈ తతంగం గమనిస్తూనే ఉన్నాను. మొదట్లో 'ఆమె' మీద మంచి అభిప్రాయం ఉండేది నాకు. కాని చలపతి నోటిద్వారా ఆమె కారెక్టర్ తెలుసుకున్న నాకు ఆమెను చూస్తేనే అసహ్యం కలిగేది. కుష్ఠురోగిని చూసిన రోత ఫీలయ్యేవాడిని. 'ఆమె' కారణంగా వాళ్ళింటికి వెళ్ళడం దాదాపు మానేశాను. చలపతిని మాత్రం కలుస్తుండే వాణ్ణి...

చలపతితో మళ్ళీ చాలాసార్లు డైవర్స్ ప్రస్తావన తెచ్చాను. అతను పరువు, ప్రతిష్ఠ అంటూ వూగుతున్నాడు. అతనిలో ఉన్న ఆ బలహీనత ఆసరా చేసుకునే ఆమె అంత నిబ్బరంగా ఉంది. చలపతి తనకు డైవర్స్ ఇవ్వలేడు, తనని వదులుకోలేడని ఆమె బాగా గ్రహించింది. అందుకే తన ఇష్టం వచ్చినట్లు తైతక్కలాడుతూంది.

* * *

పై సంపాదన కావాలనుకున్నవాడికి నా సీటు కల్పవృక్షమే! అటువంటిది మనకు గిట్టదు. ''ఇంతకుముందున్నవాడే నయం. డబ్బు తిన్నా పనిచేసేవాడు...వీడు తినడు, చేయడు.'' సిన్సియర్‌గా వర్క్ చేసుకుంటూ పోతున్న నాకు కస్టమర్స్ నుండి వచ్చిన కామెంట్ అది! అంతటితో వూరుకోలేదు. అందరూ కలిసి చందాలు వేసుకుని మరీ నన్ను అక్కడ్నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించారు. సిన్సియారిటీకి, హార్డ్‌వర్క్‌కు లభించిన సత్కారం అది! దీనికి మా కొలీగ్స్ కూడా మహానందించారు. వాళ్ళ 'వాటాలు' ఇకనుండి సక్రమంగా అందుతాయి మరి....

అదృష్టవంతుణ్ణి చెరిచేవాళ్ళు లేరంటారు.... అనుభవంతో తెలిసింది...వాళ్ళు, వాళ్ళకు తెలికుండా ఒక మంచిపని చేశారు. నా నేటివ్‌ప్లేస్‌కు దగరగా ట్రాన్స్‌ఫర్ చేయించారు. ఇది తెలిసుంటే వాళ్ళు ఇంకా ముందు జాగ్రత్తలు తీసుకుని ఉండే వాళ్ళేగా!

* * *

ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిన ఏడాదికి ఆఫీసు పనిమీద 'ఆ వూరు' వెళ్ళాల్సి వచ్చింది. ఆ వూరనగానే చలపతి గుర్తుకొచ్చాడు. అలాగే చలపతిరావును కూడా చూసి రావచ్చుననే ఉద్దేశంతో బయలుదేరాను. అక్కడ దిగగానే త్వరగా ఆఫీసు పని ముగించుకోగలిగాను. అక్కడి మా ఆఫీసుకు చాల దూరంలో ఉంది చలపతి ఆఫీసు. చలపతిని చూడాలని చాల కుతూహలంగా ఉంది. రిక్షా తీసుకుని అక్కడకు చేరుకున్నాను. చలపతి నన్ను చూడగానే ఎంతో సంతోషపడ్డాడు. ఆ మధ్యాహ్నం ఆఫీసుకు సెలవు పడేసి నాతో బయలుదేరాడు. చలపతి ఏం మారలేదు. అప్పటిలాగానే ఉన్నాడు. కాని మునుపటికన్నా చాల ఉత్సాహంగా కనిపించాడు.

హోటల్లో కూర్చుని చాలసేపు ముచ్చటించుకున్నాం. వచ్చిన పని అయిపోయింది. ఇక చలపతి దగ్గర సెలవు తీసుకుని బస్సెక్కుదా మనుకున్నా. ఆ రాత్రి వాళ్ళింట్లో భోజనం చేయమంది సంపేది, లేరన్నాడు. ఎంత వీలుపడదన్నా వినలేదు. ఇక తప్పదనిపించింది. బజార్లో పిల్లలకోసం పండ్లు, బిస్కట్స్ తీసుకున్నాను. చలపతి దాంపత్యం గురించి ఏం మాట్లాడలేదు. ఇంతకు ముందు ఉంటున్న ఇల్లే...ఆ రాత్రి భోజనాలకోసం చాల హడావుడి చేశాడు చలపతి. ''నాకోసం ప్రత్యేకంగా ఏమీ శ్రమపడొద్దు బాబూ'' అంటున్నా వినకుండా 'భార్య'కు ఏవేవో పురమాయిస్తూనే ఉన్నాడు. వంటగదిలో నుండి 'ఆమె' మాటలు వినవస్తున్నాయ్. బయటకొచ్చి కనీసం పలుకరించనయినా లేదు. అయినా 'ఆమె' పలుకరించకపోతే తనకేంటి, తను వచ్చింది చలపతికోసం. పిల్లలుమాత్రం చుట్టూ మూగి 'అంకుల్', 'అంకుల్' అంటూ ఏవేవో చెబుతూనే ఉన్నారు. అంతా సిద్ధం చేయించి 'ఇక భోజనానికి లే' అన్నాడు చలపతి. డైనింగ్ టేబుల్ ముందు నేను, చలపతి పిల్లలు కూర్చున్నాం. చాల ఐటమ్స్ ఉన్నాయి టేబుల్‌మీద. అన్నిటికన్నా నా కిష్టమయిన 'వంకాయ పూర్ణం' కలుపుకుని ముద్ద నోట్లో పెట్టుకోబోతున్నాను...ఇంతలో ''కులాసానా అన్నయ్యగారూ'' అంటూ . వచ్చి పలుకరించింది 'ఆమె!' ఒక్కసారిగా దిగ్భ్రాంతి చెందాను. నోట మాట రాలేదు. అలా మాన్పడిపోయాను. భోజనం ఎలా ముగించానో నాకే తెలియదు.

తరువాత వాకింగ్‌కు వెళ్ళినప్పుడు చెప్పాడు చలపతి. తను ట్రాన్స్‌ఫరయి వెళ్ళిన నెలకు జబ్బు— ఒకరోజు వంటచేస్తుంటే స్టౌ బరస్టయి 'ఆమె' ముఖం, ఒళ్ళంతా కాలిందట! అసలు బ్రతక దనుకున్నారట...

''...చారడేసి కళ్ళు, తీర్చిదిద్దిన కనుబొమలు, కొనదేరిన ముక్కు, గులాబీ రంగు చెక్కిళ్ళు, ముచ్చటగా ఉండే బుల్లిపెదాలు...ఆ నిండైన విగ్రహం'' ఒక్కసారిగా స్ఫురణకు వచ్చాయి.

ప్రస్తుతం 'ఆమె' ముఖం గుర్తుకొచ్చి ఒక్కసారి ఒళ్ళంతా గగుర్పొడిచింది. ఎంత వికృతంగా తయారయింది. చిన్నపిల్లలు చూస్తే జడుపు జ్వరాలొస్తాయి కూడా! అంతటి అద్భుత సౌందర్యం దారుణంగా హత్య చేయబడింది!

అప్పట్నుంచి 'అతను' ('వాడు' ఆ 'రోగ్') 'ఆమె' దగరకు రావటంలేదట! ''ఇప్పుడు నా సంసారం హాయిగా సాగిపోతూంది'' అన్నాడు చలపతి.

అయితే చివరకు భగవంతుడు ఈ సమస్యను ఇలా పరిష్కరించాడా! అనుకుంటూ చలపతి దగర సెలవు తీసుకుని బస్సెక్కాను. *